సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం ၊ 2 ၊ మార్చి ၊ 2023



బహుజనులకు భరోసా

బీఎస్పీతోనే బహుజనులకు భరోసా వస్తుందని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 10లో ▸



పుష్కర బ్రహ్మోత్సవం

వట్టెం వేంకటేశ్వరస్వామి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.0 /18.3

వాతావరణం

ఉదయం చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఆకాశం నిర్మలంగా ఉండి ఉక్కపోసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

10వ తేదీ నుంచి సదరం క్యాంపులు

నాగర్‌కర్నూల్ క్రైం: మార్చి 10 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే సదరం క్యాంపులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ నర్సింగరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ–సేవా కేంద్రాల్లో మార్చి 2 నుంచి స్లాట్లు బుక్ చేసుకొని కేటాయించిన తేదీల్లో క్యాంపులకు హాజరుకావాలని పేర్కొన్నారు. 10, 15, 21, 31 తేదీల్లో శారీరక వైకల్యం, 16, 29 తేదీల్లో వినికిడి లోపం ఉన్న వారికి నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రిలో, అంధులకు 13వ తేదీన జిల్లా జనరల్ ఆస్పత్రిలో, మానసిక దివ్యాంగులకు 9, 24 తేదీల్లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాంపులు కొనసాగుతాయని వివరించారు. కేటాయించిన తేదీల్లో మెడికల్ రిపోర్టులు, సదరం స్లాట్ బుకింగ్ రసీదు, 3 పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్సు ప్రతులు తీసుకు రావాలని సూచించారు.

నేడు బహిరంగ వేలం

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 10 వరకు కొనసాగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో టెంకాయలు, తలనీలాలు, కొబ్బరి చిప్పలు, లడ్డు, పులిహోర విక్రయ దుకాణాల వేలం గురువారం దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈఓ రఘు బుధవారం తెలిపారు. టెంకాయలకు రూ.5 లక్షలు, తలనీలాలకు రూ.లక్ష, కొబ్బరి చిప్పలకు రూ.50 వేలు, పులిహోర, లడ్డూ ప్రసాదాలకు రూ.2 లక్షలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. టెండర్ దక్కించుకున్న వారు 75 శాతం వెంటనే, మిగతా డబ్బులు రెండ్రోజుల్లో చెల్లించాలన్నారు. నిర్ణీత సమయంలో డబ్బులు చెల్లించకపోతే రద్దు చేస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు పూర్తి చిరునామా ఉన్న ఆధార్ కార్డు తీసుకురావాలని, ఆలయ సిబ్బంది, సంబంధిత వ్యక్తులు, గతంలో బకాయిదారులు వేలంలో పాల్గొనే అవకాశం లేదని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ క్రైం: దివ్యాంగుల ఉపాధి, పునరావాస పథకం 2022–23 సంవత్సరానికిగాను జీవనోపాధి, వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడానికిగాను దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి టీయూ వెంకటలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 చివరి గడువని, TSOBMMS పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వడివడిగా..!

కల్వకుర్తి–నంద్యాల ఎన్‌హెచ్–167కే ప్యాకేజీ–1 టెండర్ ఖరారు

- 36.33 శాతం తక్కువకు పనులు దక్కించుకున్న ఆర్‌కే ఇన్‌ఫ్రా
- చివరి దశకు భూ సేకరణ పనులు
- పూర్తయిన ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రజల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలు



అచ్చంపేట: కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి (167కే)ని 2024 నాటికి అందుబాటులోకి తీసుకు రావాలని కేంద్రం యోచిస్తోంది. ఈ రహదారి నిర్మాణాన్ని మూడు ప్యాకేజీలుగా విభజించగా ప్యాకేజీ–1 టెండర్ ఖరారైంది. మొదటి విడతలో కల్వకుర్తి నియోజకవర్గంలోని కొట్ర చౌరస్తా నుంచి కొల్లాపూర్ నియోజకవర్గంలోని మల్లేశ్వరం వరకు 86 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.629.96 కోట్ల అంచనా వ్యయంతో 2022, సెప్టెంబరు 26 వరకు టెండర్లు స్వీకరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కాంట్రాక్టర్లతో పాటు తెలంగాణ, ఏపీకి చెందిన ప్రముఖ కాంట్రాక్టు కంపెనీలు టెండర్లు దాఖలు చేయగా.. 36.33 శాతం తక్కువకు రాయలసీమకు చెందిన ఆర్‌కే ఇన్‌ఫ్రా కంపెనీ 20 రోజుల క్రితం దక్కించుకుంది. టెండర్ అగ్రిమెంట్‌కు కాంట్రాక్టర్‌కు నెలరోజుల గడువు ఉంటుంది. గడువు నుంచి అపాయింట్‌మెంట్‌కు మరో నెలరోజుల సమయం పడుతుంది. ఇదంత పూర్తి కావడానికి రెండు నెలల సమయం పడుతుంది. భూ సేకరణ 90 శాతం పూర్తయితేనే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి..

కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి (167కే) భూ సేకరణ చివరి దశకు చేరుకుంది. రెవెన్యూ అధికారులు భూసేకరణపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన 362.902 ఎకరాల భూమిని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా అక్కడక్కడ అభ్యంతరాలు, నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

మండలాల వారీగా భూ సేకరణ ఇలా..

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో..)
వెల్దండ	26.226
కల్వకుర్తి	106.556
తాడూరు	63.150
నాగర్‌కర్నూల్	76.955
తెలకపల్లి	00.515
పెద్దకొత్తపల్లి	39.761
కొల్లాపూర్	49.739

ప్రస్తుతం ప్రైవేట్ భూమి సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. ఇప్పటికే డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తి కాగా డిక్లరేషన్ చేయాల్సి ఉంది. పరిహారం అందజేసే అంశంపై కసరత్తు చేస్తున్నారు. అవార్డు ప్రక్రియ మొదలైతే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించే అవకాశం ఉంది. మరో నెలరోజుల్లో మొత్తం భూసేకరణ ప్రక్రియ పూర్తి కానుంది. బైపాస్ ప్రాంతాల్లో నాలుగు వరుసలకు సరిపడా 45 మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేపడుతున్నారు.

పూర్తిగా కొత్త రోడ్డు..

ప్రస్తుతం హైదరాబాద్–కర్నూల్, నంద్యాల హైవేలో ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ మార్గం మీదుగా కడప, తిరుపతి, చెన్నైకి రాకపోకలు కొనసాగుతున్నాయి. కొత్త జాతీయ రహదారి జిల్లాలోని కల్వకుర్తి వద్ద మొదలై కొల్లాపూర్, సోమశిల మీదుగా ఆత్మకూర్, నంద్యాల వరకు కొనసాగుతుంది. ఆ భాగంలో ఇప్పటికే ఉన్న రహదారిని విస్తరించనున్నారు. కొట్ర జంక్షన్ నుంచి కల్వకుర్తి, తాడూరు, నాగర్‌కర్నూల్, దేశిటిక్యాల, కొల్లాపూర్ చౌరస్తా మీదుగా సోమశిల రోడ్డు, మల్లేశ్వరం వరకు కొత్త రహదారి రూపుదిద్దుకుంటుంది. హైదరాబాద్ నుంచి తిరుపతి, చెన్నై వెళ్లే వాహనాలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తారు.

రెండునెలల్లో పనులు ప్రారంభం..

కల్వకుర్తి–సోమశిల జాతీయ రహదారి పనులను ఆర్‌కె ఇన్‌ఫ్రా కంపెనీ దక్కించుకుంది. 36.33 శాతం తక్కువకు టెండరు వేశారు. రెండు నెలల్లో పనులు మొదలవుతాయి. క్షేత్ర స్థాయిలో భూసేకరణ పూర్తయింది. అవార్డు ప్రకటన వచ్చిన తర్వాత 90 శాతం భూసేకరణ జరిగితే కాంట్రాక్టర్ పనులు ప్రారంభిస్తారు. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, సోమశిల ప్రాంతాల్లో జంక్షన్లు ఏర్పాటు కానున్నాయి.

– బి.రాజేందర్, ఈఈ, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ

తీగల వంతెన, అనుసంధాన రహదారులకు రూ.436.91 కోట్లు..

మల్లేశ్వరం–సిద్ధేశ్వరం గుట్టల మధ్య కృష్ణానదిపై నిర్మించ తలపెట్టిన తీగల వంతెన, ఇరువైపుల బైపాస్ రోడ్డు నిర్మాణానికి టెండర్లు ఖారారు కావాల్సి ఉంది. రూ.1,082 కోట్లతో 1.077 కి.మీ. తీగల వంతెన, రెండువైపుల అనుసంధాన రహదారి నిర్మాణానికి కేంద్రం అనుమతించింది. 13.8 కి.మీ. నిడివిగల పనికి రూ.436.91 కోట్లకు జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ (ఎస్‌ఎఫ్‌సీ) ఆమోద ముద్ర వేసింది. రెండువైపుల ఉన్న గుట్ట భాగాన్ని 30 మీటర్ల వెడల్పుతో కట్ చేయడం, మరికొంత మేర పూడ్చి రోడ్డు నిర్మించే కీలక భాగం ఇందులో ఉంది. రెండు, నాలుగు లేన్ల విస్తరణకు ఈ నిధులు మంజూరయ్యాయి. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో నిర్మించేందుకు అనుమతించారుద్దీ రహదారి నిర్మాణంతో హైదరాబాద్ నుంచి తిరుపతి, చెన్నైల మధ్య సుమారుగా 80 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఐకానిక్ వంతెన రెండు తెలుగు రాష్ట్రాలకు ముఖద్వారంగా నిలుస్తోంది. పర్యాటకంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

విధుల్లో నిర్లక్ష్యం సరికాదు

- అదనపు కలెక్టర్ మోతీలాల్

అచ్చంపేట రూరల్: విధులను నిర్లక్ష్యం చేసే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని సంయుక్త కలెక్టర్ మోతీలాల్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ రాములునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ..

ఉప్పునుంతల: అధికారులు, కార్యాలయంలో పని చేసే సిబ్బంది విధి నిర్వహణలో సమయ పాలన పాటించాలని.. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ మోతీలాల్ హెచ్చరించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికలు, డీఆర్ తదితర రికార్డులను పరిశీలించారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన వెంట ఆర్డీఓ పాండూనాయక్, తహసీల్దార్ శైలేంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సంయుక్త కలెక్టర్

విద్యుత్ ఉద్యోగుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

మన్ననూర్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం 5వ రోజు ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం, విద్యుత్ పాలనా విభాగం ప్రధాన కార్యాలయం వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉద్యోగులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. పీఆర్సీ, పాత పింఛన్ అమలు చేయడంతో పాటు 2022 నుంచి ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌పీఈ జేఏసీ, ఎస్‌ఎల్‌బీహెచ్‌ఈఎస్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రపై దాడి సిగ్గుచేటు

- డీసీసీ అధ్యక్షుడు డా. వంశీకృష్ణ

బల్మూర్: జయశంకర్ భూపాలపల్లిలో కొనసాగుతున్న హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకొని దాడికి పాల్పడటం సిగ్గుచేటని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మన్‌పేటలో ఇటీవల మృతిచెందిన మాజీ వార్డుసభ్యుడు కృష్ణయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల అవినీతి అక్రమాలను ప్రజలకు వివరిస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని.. ఇదిచూసి ఓర్వలేకే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని.. రాగానే ధరణి పోర్టల్ ఎత్తివేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌గౌడ్, జంగయ్య, నిరంజన్‌గౌడ్, అనిల్, పాపయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

కొల్లాపూర్: మండల కేంద్రంలో జరిగిన ఈదమ్మ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు బుధవారం ముగిశాయి. సీనియర్ విభాగం వృషభాలకు పోటీలు నిర్వహించగా.. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం దేవబండకు చెందిన భాస్కర్‌గౌడ్ వృషభాలు మొదటి బహుమతిని, వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్దదగడకు చెందిన ఎం.గోపాలకృష్ణ వృషభాలు రెండో బహుమతిని, నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం ముదురాళ్లపల్లికి చెందిన పులి చిన్న ఓబుల్‌రెడ్డి వృషభాలు మూడో బహుమతి, నంద్యాల జిల్లా బిళ్లలాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి వృషభాలు నాలుగో బహుమతి సాధించాయి. విజేతలకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నగదు పురస్కారాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. పోటీలు పారదర్శకంగా నిర్వహించినందుకు రైతుసంఘాల నాయకులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌నాయక్, పెబ్బేటి కృష్ణయ్య, జగన్మోహన్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాంచందర్‌యాదవ్, చంద్రశేఖరాచారి, బండల వెంకటస్వామి, చాకలి నర్సింహ, బిజ్జవేణు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు నగదు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

‘తొలిమెట్టు’తో వందశాతం సామర్థ్యాలు

- డీఈఓ గోవిందరాజులు

బిజినేపల్లి : ఉపాధ్యాయులు పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం అమలుచేసి విద్యార్థుల్లో 100 శాతం విద్యా సామర్థ్యాలు సాధించాలని డీఈఓ గోవిందరాజులు కోరారు. బుధవారం మండలంలోని మంగనూర్, లట్టుపల్లి, గంగారం, శాయిన్‌పల్లి, బిజినేపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పదోతరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని, ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, సౌకర్యాలను పరిశీలించారు.



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

‘కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి’

పెద్దకొత్తపల్లి: వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని మహాసముద్రం, తిర్మాంపల్లి, నారాయణపల్లి, మారేడుమాన్‌దిన్నె, చంద్రబండతండా, చిన్నకార్వాములలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఉన్న అనుచరులందరూ శక్తివంచన లేకుండా పనిచేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, నాయకులు దండు నర్సింహ, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, చిన్నయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

●పాలమూరులో కీలుబొమ్మలాట

ఖద్దరు ఖాకీలు..!

పోలీసులతో ముఖ్యనేతల రాజకీయాలు

- వివాదాస్పదంగా పలువురి తీరు
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు విఘాతం
- వనపర్తి, గద్వాలలో మితిమీరిన ఆకృత్యాలు
- మనిగిళ్ల ఘటనలో పోలీసుల నిర్వాకంపై విమర్శలు

అసాంఘిక శక్తుల భరతం పట్టి, శాంతి భద్రతల పరిరక్షణలో కీలక భూమిక వహించాల్సిన పోలీస్‌శాఖ ‘అధికార’ నేతల చేతుల్లో కీలుబొమ్మగా మారిందా.. రాజకీయ చదరంగంలో ముఖ్య ప్రజాప్రతినిధులు ఖాకీలనే పావులుగా చేసి ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారా.. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు తిలోదకాలిచ్చి.. లీడర్ పోలీసింగ్‌కే ప్రాధాన్యమిస్తూ వివాదాలకు కేంద్రబిందువుగా నిలుస్తున్నారా.. తమకు ‘పెద్ద’లే అండగా ఉన్నారన్న ధీమాతో ఖాకీలు బరి తెగిస్తున్నారా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఉమ్మడి పాలమూరువ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నట్లు ఇటీవల పలు ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. వనపర్తి జిల్లా కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడిపై లాఠీ జులుం ప్రదర్శించిన తీరు సంచలనం సృష్టించిన నేపథ్యంలో ‘ప్రత్యేక’ కథనం..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

వివాదాలకు కేరాఫ్‌గా..

- నాగర్‌కర్నూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డిపై ఐజీ నాగిరెడ్డికి ఫిర్యాదు అందింది. టీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలను వేధిస్తున్నాడని, ఇసుక మాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల సహకరిస్తూ దోచుకుంటున్నాడని అప్పటి కాంగ్రెస్ నేత కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.
- ఎన్నికల సమయంలో తిమ్మాజిపేటకు చెందిన ఓ కార్యకర్తను నాగర్‌కర్నూల్ స్టేషన్‌కు పిలిపించి కొట్టినట్లు సీఐ శ్రీనివాస్‌రెడ్డిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనికి సంబంధించి అప్పుడు కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న నాగం జనార్దన్‌రెడ్డి అతడిపై ఫిర్యాదు చేశారు.
- కొత్తకోట మండలం అమడబాకులలో పులిగుట్ట మైనింగ్ పనులకు అడ్డుపడుతున్నారనే ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ఆ ఊరి గ్రామస్తులను కొందరిని స్టేషన్‌కు పిలిపించాడు. గంటల తరబడి వెయిట్ చేయించడంతో పాటు పరుష పదజాలతో దూషించినట్లు సమాచారం. దీంతో గ్రామస్తులు ఆ సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కొత్తకోట చౌరస్తాలో ఆందోళనకు దిగారు.
- గతేడాది అక్టోబర్‌లో గోపాల్‌పేటకి చెందిన గొల్ల రామకృష్ణ, అతడి సోదరుడు రాముడు.. అదే గ్రామానికి చెందిన దాసరి నరసింహ పెబ్బేరు గొర్ల సంతకు వచ్చారు. అనంతరం వారు మద్యం సేవించి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో వెల్డింగ్‌షాప్ వద్ద స్థానికులతో గొడవపడ్డారు. ఈ క్రమంలో రామకృష్ణకు తీవ్రగాయాలు కాగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ కేసులో పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ పెట్టి బేరం కుదిర్చినట్లు సీఐ శ్రీనివాస్‌రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి.

రగులుతున్న ‘పెద్ద’మందడి..



వనపర్తి జిల్లాలోని ఓ ముఖ్యనేతకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశాడనే ఫిర్యాదు మేరకు పెద్దమందడి మండలం మనిగిళ్లకి చెందిన శివయాదవ్‌పై పోలీసులు 505(2), 504, 506ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ కింద కేసు నమోదు చేశారు. గత నెల 22న మధ్యాహ్నం ఆ యువకుడిని వనపర్తి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించుకున్న పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. అతడి ఒంటిపై, వెనుక పిరుదుల భాగంలో తీవ్ర గాయాలకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రోజంతా విచక్షణారహితంగా చిత్రహింసలకు గురి చేసినట్లు బాధితుడు స్వయంగా వెల్లడించడం బీఆర్‌ఎస్‌శ్రేణులతో పాటు ప్రజలు ఉలిక్కిపడ్డారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తి అతడిపై పోలీసులు ప్రతాపం చూపించడం వెనుక ముఖ్యనేత ప్రోద్బలమే కారణమని భావిస్తున్నారు. ఈ క్రమంలో విపక్షపార్టీలతో పాటు అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రజాసంఘాలు ఆందోళనలు చేపట్టడంతో జిల్లా అట్టుడుకుతోంది.

‘నడిగడ్డ’లో అదే బురద..

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఖాకీలతో రాజకీయం ‘అధికార’ నేతలకు అలవాటుగా మారింది. గతంలో ప్రజాప్రతినిధుల మధ్య ఆధిపత్య పోరుతో పోలీసులు సైతం రెండు వర్గాలుగా చీలిపోయి రాజకీయం నెరిపారు. పలువురు బదిలీల అనంతరం పరిస్థితిలో కొంత మార్పు వచ్చినప్పటికీ.. ప్రస్తుతం ముఖ్యనేత మాట వినని వారు, విపక్షాలే టార్గెట్‌గా పోలీసులు వేధింపులకు దిగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మల్దకల్ మండలం పావనంపల్లిలో ఓ ఇంటిపై దాడి, మద్దెలబండ–దాసరిపల్లికి చెందిన వ్యక్తుల మధ్య రైస్‌మిల్లు గొడవలో, గట్టు మండలం ఆలూరులో చోటుచేసుకున్న ఘర్షణలో ఖాకీలు ఏకపక్షంగా వ్యవహరించినట్లు సమాచారం. ముఖ్యనేత కనుసన్నల్లో ఓ పోలీస్ అధికారి అన్నీ తానై చక్కబెడుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట, బిజినేపల్లి, తెలకపల్లి మండలాలతో పాటు మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో సైతం అలాంటి పరిస్థితే నెలకొనగా.. పోలీసుల తీరు వివాదాస్పదంగా మారినట్లు తెలుస్తోంది.

చట్టపరమైన చర్యలు మాత్రమే తీసుకున్నాం



పెద్దమందడి మండలం మనిగిళ్ల గ్రామానికి చెందిన శివయాదవ్‌పై అందిన ఫిర్యాదు మేరకు చట్టపరమైన చర్యలు తీసుకున్నాం. అతడిని కొట్టినట్లు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు. పెద్దమందడి ఎస్ఐకి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచాం.

– శ్రీనివాస్‌రెడ్డి, కొత్తకోట సీఐ, వనపర్తి జిల్లా

ఓ సీఐ, మరో ఇద్దరు ఎస్సైలు.. సారీ చెప్పమంటూ?

పెద్దమందడి పోలీస్‌స్టేషన్ కొత్తకోట సర్కిల్ పరిధిలోకి వస్తుంది. అయితే వనపర్తి ఇన్‌చార్జ్ సీఐగా శ్రీనివాస్‌రెడ్డి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఆ యువకుడిని వనపర్తి స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం. అయితే ఫిర్యాదు అందకుముందే అతడిని అదుపులోకి తీసుకున్నట్లు.. అదేవిధంగా బెల్ట్ పట్టాతో సదరు సీఐ, మరో ఇద్దరు ఎస్సైలు విచక్షణరహితంగా కొట్టిన కొన్ని గంటల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు.. పోలీసులకు సంబంధించిన ఫోన్ నుంచి ముఖ్యనేతకు బాధితుడితో సారీ చెప్పమంటూ ఒత్తిడి చేసి క్షమాపణ చెప్పించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితుడు శివయాదవ్ ఈ ఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేయడంతో పాటు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాడు. అలాగే బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



క్లుప్తంగా

వ్యక్తి మృతి: కేసు నమోదు

ఊట్కూరు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తండా శివారులో నారాయణపేట–మరికల్ రోడ్డుపై మంగళవారం రాత్రి గన్మాడకు చెందిన సుధాకర్(30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సుధాకర్ నారాయణపేటకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా, తిమ్మారెడ్డిపల్లి తండా చెరువుకట్ట వద్ద ఆగి ఉన్న టాక్టర్ ట్రాలీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో చికిత్స కోసం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడు. బుధవారం భార్య మానస్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు. పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి

కొత్తకోట: మండలంలోని కనిమెట్ట సమీపంలో బైకుపై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. అడ్డాకుల మండలం కాటవరం చెందిన ఎరుకలి శోభన్ (35) తన సొంత పనుల కోసం కొత్తకోట వచ్చి బైకుపై తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గం మధ్యలోని కనిమెట్ట సమీపంలో 44వ జాతీయ రహదారిపై అదుపుతప్పి కిందదడంతో పాటు అక్కడిక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతినికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

రెండు బైకులు ఢీకొని మరో యువకుడు..

కల్వకుర్తి టౌన్: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలపాలైన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన అవినాష్‌రెడ్డి (30) కొంత కాలంగా తన మామగారి వద్ద పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఉంటున్నాడు. బుధవారం రాత్రి వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై కొట్రకు వెళ్లి తిరిగి కల్వకుర్తికి వస్తున్నాడు. అదేవిధంగా వెల్దండ మండలం మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రవీందర్ అతని భార్యను కల్వకుర్తి నుంచి బైక్‌పై ఎక్కించుకొని వెల్దండకు తిరిగి బయలుదేరాడు. ఈక్రమంలో రెండు బైకులు పట్టణంలోని కల్యాణ్‌నగర్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో అవినాష్‌ను ఆస్పత్రిలో ప్రథమచికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న రవీందర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రథమచికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఒక పాప ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఉప్పునుంతల: మండలంలోని ఈరట్వానిపల్లిలో పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడిచేశారు. గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు రాత్రి 11గంటల ప్రాంతంలో ఇంటిపై దాడిచేసి ఆరుమంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.50,300ల నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. పట్టుబడిన ఆరుమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో రైతు సమస్యలు తెలుసుకోండి

బిజినేపల్లి: రైతులకు సేవ చేయాలంటే ముందుగా వారి సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కార మార్గాలను అన్వేషించాలని పాలెం కేవీకే సమన్వయకర్త డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. పాలెం కేవీకే అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు వారం రోజుల పాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై బుధవారం అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవ సాయ అనుబంధ రంగాలైన పాడి, చేపల పెంపకం, వాణిజ్య పంటలు, పండ్లు, కూరగాయలు, పట్టు పురుగులు, గొర్రెలు, కోళ్ల పెంపకం వంటి పలు రంగాల గురించి విద్యార్థులకు అవగాహన ఉండాలని సూచించారు. శాస్త్రవేత్త రాజశేఖర్, పీజీడీఎం బ్యాచ్ సమన్వయకర్త ఎస్‌వీ.స్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి చిరుధాన్యాలే ముఖ్యం..

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పకుండా రోజులో ఒక్కసారైన చిరుధాన్యాల ఆహారం తీసుకోవాలని పాలెం కేవీకే సమన్వయకర్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పాలెం కేవీకేలో గిరిజన ఉపపథకం ద్వారా మహిళలకు, రైతులకు చిరుధాన్యాల సాగుపై శిక్షణ, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను తినాలని, సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆదిశంకర్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.



అర్ధరాత్రి హైనా కలకలం



పంచనామా నిర్వహిస్తున్న అటవీ, పశువైద్యశాఖ అధికారులు

- మేకల మందపై దాడి
- గొంతువద్ద కొరికి రక్తంపీల్చిన వైనం
- జడ్చర్లలో అటవీ, పశువైద్యశాఖ అధికారుల పరిశీలన
- తొలిసారిగా నివాస ప్రాంతంలోకి హైనా కదలికలు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణం రాజీవ్‌నగర్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి హైనా కలకలం రేపింది. కాలనీ సమీపంలో అశోక్ చెందిన కాంపౌండ్‌లో ఉంచిన 9మేకలపై దాడి చేసి రక్తం పీల్చి వాటిని చంపింది. మేకల అరుపులు విన్న స్థానికులు, యజమాని కర్రలతో ఘటనా స్థలానికి చేరుకుని బెదిరించేందుకు యత్నించగా వారిపైకి రావటంతో పరుగులు తీశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా.. సాధారణంగా అటవీ, వాటికి సమీపంలో ఉండే ప్రాంతాల్లోనే సంచరించే ప్రమాదకర జంతువు హైనా నివాసప్రాంతమైన బాదేపల్లి పట్టణంలోకి రావటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రాజీవ్‌నగర్ కాలనీకి సమీపంలో మాంసం విక్రయదారుడు అశోక్ తన ఖాళీ స్థలంలో ఆరు అడుగుల ఎత్తుతో ప్రహరీ నిర్మించి అందులో నిత్యం కొన్ని మేకలు, గొర్రెలు ఉంచుతాడు. అలాగే శనివారం 20 మేకలు తీసుకువచ్చి ఉంచాడు. వాటిలో ఆదివారం 11 వరకు విక్రయించగా మరో 9 మిగిలి ఉన్నాయి. ప్రహరీకి సమీపంలో అతడు నివాసం ఉంటున్నాడు. అతడి మిద్దెపై నుంచి చూస్తే అక్కడ ఏం జరుగుతుందో స్పష్టంగా కనిపిస్తుంది. ఎప్పటిలాగే రాత్రి 11:30గంటల వరకు మేకల వద్దే గడిపి ఇంటికి వెళ్లాడు.

బీభత్సం సృష్టించిన హైనా

రాత్రి 12గంటల సమయంలో ఎక్కడినుంచి వచ్చిందో తెలియదుగాని హైనా ప్రహరీ దూకి అందులోని మేకలపై దాడిచేస్తూ బీభత్సం సృష్టించింది. హైనను చూసిన మేకలు ఒక్కసారిగా గట్టిగా అరుపులు పెట్టాయి. అప్పటికే హైన మేకల గొంతులను కొరికి రక్తం పీల్చేసింది. మేకల అరుపులు రావటంతో సమీపంలోని ఇంటిలో ఉన్న వెంకటయ్య, అశోక్‌కు సమాచారం అందించటంతో కర్రలు పట్టుకుని చేరుకున్నారు. అప్పటికే హైనా మేకలన్నింటిని పొట్టన పెట్టుకుంది. కాంపౌండ్‌లో మేకలు ప్రాణాలు విడిచి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కర్రలతో హైనాను వెళ్లగొట్టేందుకు యత్నించగా వారిపైకి దూకింది. దీంతో వారు అక్కడినుంచి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఎలాగోలా దాన్ని బెదిరించటంతో అక్కడి నుంచి పారిపోయింది. ఈ ఘటన రాత్రి 12గంటల నుంచి 1గంటల మధ్య చోటుచేసుకుంది. హైనా దాడి గురించి కాలనీవాసులకు తెలియగానే పెద్ద ఎత్తున చేరుకున్నారు. బుధవారం ఉదయం వార్డు కౌన్సిలర్ సతీష్‌కు బాధితుడు సమాచారం అందించగా అటవీ, పశువైద్యశాఖ అధికారులకు విషయం చెప్పారు. అటవీశాఖ అధికారి కురుమంతి, పశువైద్యశాఖ డా. ఆశారాణి చేరుకుని పంచనామా నిర్వహించారు.

ఎమ్మెల్యే పరామర్శ

మేకలు కోల్పోయిన అశోక్‌ను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శించారు. రూ.25వేలు విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం నుంచి ఆదుకునేలా చూస్తానని, అధైర్యపడ వద్దని భరోసా కల్పించారు.

భయం వేసింది



అర్ధరాత్రి 12గంటలు దాటాక వెంకటయ్య ఫోన్‌చేసి మేకలు అరుస్తున్నాయి అంటూ చెప్పటంతో అక్కడికి వెళ్లాను. హైనాను చూడంగానే భయం వేసింది. మేము వెళ్లేసరికే అన్ని మేకల గొంతులను కొరికి చంపేసింది. నా జాగాలో ప్రహరీ నిర్మించి నిత్యం మేకలు ఉంచుతాను. ఏళ్లుగా ఉంచుతున్నా ఎన్నడూ ఏమి కాలే. ఈ రోజు ఇలా అయింది. కర్రలతో దాన్ని బెదిరించేందుకు చూడగా మాపైకి వచ్చింది. ఎలాగోలా తప్పించుకున్నాం. 9 మేకల విలువ రూ.75వేలు ఉంటుంది.

– అశోక్, బాధితుడు, రాజీవ్‌నగర్‌కాలనీ, బాదేపల్లి

హైనాగానే గుర్తించాం

బాధితులు చెప్పిన ఆనవాళ్ల ప్రకారం అది హైన గానే గుర్తిస్తున్నాం. తోడేలు సైతం ఇలాగే దాడి చేస్తుంది. ఈప్రాంతంలో తోడేలు సంచారం లేదు. నిత్యం అటవీప్రాంతం, సమీప ప్రాంతాలనుంచి మాకు హైన దాడి గూర్చి ఎక్కడోచోట ఫిర్యాదు వస్తూనే ఉంటుంది. బాదేపల్లి పట్టణం నివాసప్రాంతాల్లో మాత్రం ఇదే ప్రథమం. రైతులు పొలాలవద్ద, కొట్టాల వద్ద పశువులను కట్టేయకుండా ఇళ్లవద్ద ఉంచుకుని ఉదయం వాటిని తోలుకుని వెళితే బాగుంటుంది. తెల్లవారుజామున రైతులు ఒక్కొక్కరుగా కాకుండా ఇద్దరు, ముగ్గురు కలిసి వెళితే ప్రమాదాలు ఆపవచ్చు.

–కురుమంతి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

పలు ప్రాంతాల గుర్తింపు..

మండలంలోని పలు ప్రాంతాల్లో హైనా సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. బూర్గుపల్లిలో నాలుగేళ్లక్రితం రెండు పశువులను చంపగా, అదే గ్రామంలో రెండు మూడు పర్యాయాలు హైన దాడి చేసింది. నక్కలబండతండా, సమీపంలోని గ్రామాల్లో పశువులను చంపిన ఘటనలు ఉన్నాయి. అలాగే బండమీదిపల్లి, కొండేడ్‌లో సంచరించినట్లు గుర్తించారు. ఏనాడు పట్టణ ప్రాంతంలో మాత్రం సంచరించింది లేదు. రాజీవ్‌నగర్ కాలనీ అవతల నిర్మానుష్యప్రాంతం ఎక్కువగా ఉండటంతో హైనా వచ్చుండొచ్చని అధికారులు చెబుతున్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు

- తెల్లవారుజామునే వాగులో ఇసుకను నింపుకున్న ట్రాక్టర్లు
- 'పాలమూరు సాండ్'లో అంతా పక్కదారే..



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటున్న రైతులు

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి శివారులోని పెద్దవాగులో 'పాలమూరు సాండ్' ఇసుక ట్రాక్టర్లను బుధవారం రైతులు మరోసారి అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. వాగులోంచి ఇసుకను నింపుకుని తమ పట్టా భూముల్లో ట్రాక్టర్లు వెళ్లడం మూలంగా పొలాలు పాడవుతున్నాయని రైతులు ఆందోళన చేశారు. తెల్లవారుజామునే సుమారు 60 ట్రాక్టర్లలో ఇసుకను నింపుకుని వెళ్లడానికి యజమానులు ప్రయత్నించారు. ఇంతలోనే రైతులు తమ పొలాల్లోంచి వెళ్లకూడదని వాటిని అడ్డుకుని అధికారులు, విలేకరులకు సమాచారం అందజేశారు. 8గంటల తర్వాత వాగు వద్దకు వచ్చిన ఎస్ఆర్‌ఏ రంగన్న రైతులను సముదాయించి ఇసుక ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించారు. వాటిలో కొన్నింటికి పాలమూరు సాండ్ మెసేజ్‌లు లేకున్నా అక్కడి నుంచి పంపించడం కనిపించింది. రెవెన్యూ, పోలీసు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడంతా ఇష్టారాజ్యంగా నడుస్తుంది.

పేరుకే అనుమతి

'పాలమూరు సాండ్' పేరుతో ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న వారికి ట్రాక్టర్‌తో ఒక ట్రిప్పు వేస్తున్నారు. తర్వాత ఒకటి, రెండు ట్రిప్పులను అక్రమంగా తరలిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే ట్రాక్టర్ల సంఘం నాయకులు ఒక్కో ట్రాక్టర్ నుంచి రోజూ రూ.500 నిర్వహణ కోసం వసూలు చేస్తున్నారని కొందరు ట్రాక్టర్ల యాజమానులు వాపోతున్నారు. మూడు రోజులుగా వాగు వద్ద ఇదే వ్యవహారం సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. వాగులో తెల్లవారుజామునే ట్రాక్టర్లలో ఇసుకను నింపుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పాలమూరు సాండ్ పేరుతో మెసేజ్ వచ్చిన తర్వాత ట్రాక్టర్‌కు వాగులో ఇసుక నింపుకోవడానికి ఎస్ఆర్‌ఏ అనుమతివ్వాలి. కానీ ఇక్కడ అవేమి ఆచరణలో కనిపించడం లేదు. ఈ విషయమై ఎస్ఆర్‌ఏ రంగన్నను వివరణ కోరగా తెల్లవారుజామున ట్రాక్టర్లు వాగులోకి వెళ్లి ఇసుక నింపుకోవడం తప్పేనన్నారు. మెసేజ్ వచ్చిన తర్వాత ఉదయం 8 గంటలకు వాగులోకి వెళ్లి ఇసుకను నింపుకోవాలన్నారు. మరోసారి ఇలా కాకుండా చూస్తామన్నారు.



తెల్లవారుజామునే ఇసుకతో సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

చదువుకుంటానంటే.. పెళ్లి చేశారు!

- టోల్‌ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన 14ఏళ్ల బాలిక
- చేరదీసిన షీ టీం.. సఖి కేంద్రానికి తరలింపు
- వరుడిపై పోక్సో కేసు నమోదు

బిజినేపల్లి: 'చదువుకుంటానని చెబుతున్నా నా తల్లిదండ్రులు వినలేదు.. మాయమాటలతో ఏమార్చి వారం రోజుల క్రితం పెళ్లి కూడా చేశారు.. పైచదువులు చదవాలని ఉంది.. సహాయం చేయండి' అంటూ ఓ 14 ఏళ్ల బాలిక ధైర్యంగా టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి చెప్పింది. వెనువెంటనే చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం అప్రమత్తమవడం.. బాలికను అక్కడి నుంచి సఖి కేంద్రానికి తరలించడం జరిగిపోయాయి. ఘటన గురించి తిమ్మాజీపేట ఎస్‌ఐ షేక్ శంషోద్దిన్ తెలిపిన వివరాలిలా.. తిమ్మాజీపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (14) 8వ తరగతి చదువుతోంది. అయితే, ఆమె తల్లిదండ్రులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి ఫిబ్రవరి 24న వివాహం చేశారు. కాగా మార్చి 1న (బుధవారం) ఉదయం ఆ బాలిక 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసింది. తనకు చదువుకోవాలని ఉందని, అయినా నా మాట వినకుండా తల్లిదండ్రులు ఫంక్షన్ ఉందని చెప్పి తీసుకెళ్లి పెళ్లి చేశారని పూర్తి వివరాలు తెలిపింది. వెంటనే వారు స్థానిక చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం వారికి తెలియజేయడంతో వారు షీ టీం సహాయంతో బాలిక ఇంటికి చేరుకున్నారు. బాలికను అక్కడి నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వరుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అలాగే బాలిక తల్లిదండ్రులపై కూడా బాల్యవివాహాల కేసు నమోదు చేశారు. అనంతరం బాలికను సఖి కేంద్రానికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి



అవగాహన కల్పిస్తున్న డీఏఓ వెంకటేష్

మహబూబ్‌నగర్ రూరల్: రైతులు ఆయిల్‌పామ్ పంట సాగుపై దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని మాచన్‌పల్లి రైతువేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆయిల్‌పామ్ పంట ఒకసారి వేసుకుంటే 25 నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని చెప్పారు. ఆయిల్‌పామ్ తోటల సాగుతో మంచి ఆదాయం పొందవచ్చని అన్నారు. రైతులు ఎలాంటి సందేహం లేకుండా దీన్ని సాగు చేయొచ్చని తెలిపారు. ప్రభుత్వం ఎకరాకు సంవత్సరానికి ప్రధాన పంటకు, అంతర పంటకు నిర్వహణ ఖర్చు రూ.4,200 చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ.16,800 రైతులకు రాయితీ రూపంలో వెసులుబాటు కల్పిస్తుందని వివరించారు. ఎకరాకు చతురస్రాకారంలో 50 మొక్కలు, త్రికోణాకారంలో 57 మొక్కలు నాటుకోవచ్చని తెలిపారు. ఒక మొక్కకు రైతు రూ.20 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. డ్రిప్ విధానంలో సాగు చేసేందుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 80 శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. నాల్గవ సంవత్సరం నుంచి పంట దిగుబడి ప్రారంభమై 35ఏళ్ల వరకు వస్తుందని వివరించారు. సదస్సులో సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, ఏఈఓ ఇష్రత్ సుల్తాన, హెచ్ఓ చంద్రశేఖర్, ఏఈఓ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



అయిజ: ప్రమాదవశాత్తు గడ్డివాములు, వ్యవసాయ పరికరాలు దగ్ధమైన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మున్సిపాలిటీలోని 16వ వార్డు పరిధిలో మధ్యాహ్నం ఉన్నట్టుండి గడ్డివాముల నుంచి మంటలు చెలరేగాయి. మంటలు వ్యాప్తి చెంది ఏడు వరిగడ్డి వాములు, రెండు వేరుశనగ కట్టె వాములు, రెండు ఎద్దుల బండ్లు, పశువుల కొట్టం, వ్యవసాయ పనిముట్లు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే తిమ్మన్న, ప్రభుదాసు, సూర్యప్రకాశ్, నడిపెన్న, మారెప్ప, రామన్న, హనుమంతులకు చెందిన గడ్డివాములు కాలిపోయాయి. తహసీల్దార్ లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్రావ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. రూ.4లక్షల ఆస్తినష్టం జరిగిందని, నష్టపరిహారం చెల్లించాలని బాధితులు అధికారులను కోరారు.

ఉల్లి రైతులకు నిరాశ



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లిని వేలం వేస్తున్న వ్యాపారులు

- భారీగా పడిపోయిన ధర
- క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,150, కనిష్టంగా రూ.630

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం బహిరంగ వేలంలో ఉల్లి ధరలు మరింత పడిపోయాయి. రెండు వారాలుగా వచ్చిన ధరల కంటే తక్కువ పలికాయి. బహిరంగ వేలంలో క్వింటాల్ ఉల్లికి గరిష్టంగా రూ.1,150 వరకు, కనిష్టంగా రూ.630 వరకు ధర లభించింది. గతేడాది ఆగస్టులో రూ.3వేల వరకు వచ్చిన ధరలు ఆ తర్వాత రూ.2వేలకు అటుఇటుగా కొనసాగాయి. వానాకాలంలో ఉల్లి పంటల సాగు ఎక్కువగా లేక పోవడం దిగుబడులు తగినంత రాకపోయిన కూడా ధరలు రూ.2వేలకు పైగానే ఉన్నాయి. ఇటీవల రబీ సీజన్ కింద ఉల్లి దిగుబడులు ప్రారంభమైన తర్వాత ధరలు ఒక్కసారిగా పడి పోయాయి. ఉల్లి సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా ధరలు మాత్రం పెరగడం లేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

ఎర్ర ఉల్లిని కొనే వారు లేక..

మార్కెట్‌కు వచ్చిన ఉల్లిలో తెల్లగా నాణ్యంగా ఉన్న వాటికి కొంత వరకు డిమాండ్ ఉండగా, ఇక ఎర్ర ఉల్లిని కొనేవారే కరువయ్యారు. విత్తనాలు కొనే సమయంలో ఉల్లి రకం ఎలా ఉంటుందో తెలియని రైతులు దిగుబడులు వచ్చాకా నెత్తిన చేతులు పెట్టుకుంటున్నారు. ఎర్ర ఉల్లి క్వింటాల్ ధర రూ.600 నుంచి రూ.400 వరకు ధరలు నమోదుఅయ్యాయి. వేలంలో కూడా ఎర్ర ఉల్లిని రెండు నుంచి మూడు లాట్లను ఒకేసారి వేలం వేసి ధరలు నిర్ణయించారు. చాలా వరకు ఇతర ప్రాంతాల వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఎర్ర ఉల్లిని కొనుగోలు చేశారు.

పెరిగిన దిగుమతులు

కర్నూల్, హైదరాబాద్ మార్కెట్‌లకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వందలాది లారీల ఉల్లి దిగుమతులు వచ్చిన కారణంగా ధరలు పడిపోయాయని, దీంతో ఇక్కడి మార్కెట్‌లో ధరలు తగ్గుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. అయితే బయట నుంచి వచ్చే ఉల్లి ధర కన్నా మన మార్కెట్‌లోనే రూ. 200 నుంచి 300 వరకు ఎక్కువగా ఉన్నాయని వ్యాపారులు తెలిపారు. ఎక్కువగా ఎర్రఉల్లిని పండించిన కారణంగా ధరలు రావడం లేదని తెల్ల ఉల్లికి కొంత వరకు డిమాండ్ ఉందని చెప్పారు. ప్రస్తుతం దిగుబడులు ఎక్కువగా ఉండడం అలాగే ఎర్ర ఉల్లిని నిల్వ చేసుకోడానికి వీలు లేకపోవడం వల్ల వారం వారం ఉల్లిని కొనడంతో పాటు అమ్మకాలు పూర్తి చేయాల్సి ఉంటుందని దీని వల్ల ధరలు తగ్గుతున్నాయని వివరించారు.

మహవీర్ పరిశ్రమను మూసివేయాల్సిందే..

- ఎమ్మెల్యేను కోరిన గుండేడ్ గ్రామస్తులు

బాలానగర్: మహవీర్ ఫిరోలస్ పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవనీయరాదని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని గుండేడ్ గ్రామస్తులు కోరారు. గత 40 రోజులుగా ఆ పరిశ్రమను మూసివేయాలని గ్రామస్తులు చేస్తున్న ధర్నాను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎలాంటి కాలుష్యం లేకుండా సున్నా శాతం వాయుకాలుష్యంతో పరిశ్రమను నడిపేందుకు కృషి చేయాలని పొల్యూషన్ బోర్డు అధికారులు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. రెండేళ్లలోపు పరిశ్రమను తరలించేందుకు చర్యలు చేపడతారని, అంతలోపు జీరో పర్సెంటేజ్ కాలుష్యంతో పరిశ్రమను నడిపిస్తారని, గ్రామస్తుల ఆమోదంతోనే జరుగుతుందని గుండేడ్ గ్రామస్తులకు సూచించారు. అయినా పరిశ్రమను తొలగించే వరకు రాజీ పడబోమని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కూడా గ్రామస్తులకు సహకరించాలని కోరారు. కొందరు గ్రామస్తులు పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడుకుని కోటి రూపాయలతో రాజీసైతం కుదుర్చుకున్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోందని, తాము వద్దంటున్నా ఎలా లోలోపల రాజీ పడతారని ప్రశ్నించారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు 500 ఎకరాలను గుర్తించి 300 ఎకరాలను కేటాయించిందని అన్నారు. అందులో మహవీర్ పరిశ్రమకు సైతం 10 ఎకరాల భూమిని ప్రభుత్వం ఉచితంగా కేటాయించిందని పేర్కొన్నారు. పరిశ్రమల తరలింపు రెండు సంవత్సరాల్లో పూర్తి కావాలని ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యానికి సూచించిన విషయాన్ని గ్రామస్తులకు వివరించారు. దీంతో దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ కలిసికట్టుగా ఉన్నప్పుడే ఏదైనా సాధ్యం అవుతుందని, లేనిపోని మాటలు చెబితే నమ్మి మోసపోవద్దని అన్నారు. గిరిజన రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ నాయక్, వైస్ ఎంపీపీ వెంకటచారి, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రావు, చెన్నారెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐక్యంగా పండుగులు చేసుకోవాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ

మహబూబ్‌నగర్ క్రైం: అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పండుగలు చేసుకోవాలని ఎస్పీ నర్సింహ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాలులో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసి శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదని, శాంతియుత వాతావరణానికి అందరూ సహకరించాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించడానికి పోలీసులు నిత్యం అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ మహేష్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఆదినారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 3 తులాల బంగారం, రూ.1.80లక్షల నగదు అపహరణ

మద్దూరు: మండలంలోని ఖాజీపూర్‌లో ఓ ఇంట్లో చొరబడి బంగారం, నగదు దోచుకెళ్లారు. బాధితుల, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సవారి పద్మమ్మ భర్త సవారి వెంకటప్ప చాలా కాలం క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు. చిన్న కూతురును దామరగిద్ద మండలంలోని కస్తూర్బా పాఠశాలలో చదివిస్తుంది. పెద్ద కూతురు కవిత ఈమె కలిసి వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పత్తి అమ్మగా వచ్చిన డబ్బులు రూ.95వేలు ఇంట్లో ఉంచింది. సవారి పద్మమ్మ తల్లీగారి ఊరు నారాయణపేట మండలంలో పేరపళ్లలో గజెలమ్మ జాతర ఉండడంతో పెద్ద కూతురు కవితను ఇంటి దగ్గర ఉంచి జాతర కోసం మంగళవారం సాయంత్రం వెళ్లింది. రాత్రి కూతురు ఒక్కతే ఇంటి దగ్గర ఉండడంతో బంధువుల వద్దకు వెళ్లి ఉండమని చెప్పింది. ఇంటికి తాళం వేసి కవిత బంధువుల వద్దకు వెళ్లింది. ఉదయం లేచి చూసే సరికి ఇంటి తాళం పగుల గొట్టి మూడు తులాల బంగారం, అదేవిధంగా ఇంట్లో ఉన్న రూ.1.80లక్షల నగదు అపహరణకు గురయ్యాయి. విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో సీఐ జనార్దన్, ఎస్‌ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. క్లూస్ టీంతో పరిశీలన చేయిస్తున్నట్లు తెలిపారు.



ఇంట్లో పరిశీలిస్తున్న క్లూస్ టీం

వనరులు పుష్కలం.. అవకాశాలు అపారం

▶ మొదటి పేజీ తరువాయి


శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'నేపథ్యంలో బుధవారం ఆయన కొందరు జాతీయ మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

- పెట్టుబడికి ఉన్న అవకాశాలను, పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలను పారిశ్రామిక వేత్తలకు వివరించడం ద్వారా ఈ రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడం సదస్సు లక్ష్యం. పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత సానుకూల వాతావరణం రాష్ట్రంలో ఉంది.
- ప్రభుత్వం తొలి నుంచీ స్నేహపూర్వక పారిశ్రామిక విధానంతో ముందుకు వెళుతోంది. ఏ రాష్ట్రంలోనైనా పరిశ్రమలు నెలకొల్పాలంటే ఆ రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వటం సహజం. ప్రభుత్వం నుంచి అందే సహకారం, రాయితీలు, ప్రోత్సాహకాలు, రాష్ట్రంలో ఉన్న అనువైన వాతావరణం, వనరులను పారిశ్రామివేత్తలు చూస్తారు. రాష్ట్రంలో ఇవన్నీ ఉన్నాయి. 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీరం పరిశ్రమలకు అనుకూలం.
- రాష్ట్రంలో 48 రకాల ఖనిజాలు లభ్యమవుతాయి. ఇది ఖనిజాధారిత పరిశ్రమలకు ఎంతో అనుకూలం. సిమెంట్, లైమ్‌స్టోన్ పరిశ్రమలు నెలకొల్పడానికి మన వద్ద ఎంతో అనుకూల పరిస్థితులున్నాయి.
- 6 పోర్టులున్నాయి. కొత్తగా 4 పోర్టులు నిర్మిస్తున్నాం. అందులో 3 పోర్టులను ప్రభుత్వమే సొంత నిధులతో నిర్మిస్తోంది. పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. పోర్టు రవాణా కారణంగా రాష్ట్రంలో తయారయ్యే వస్తువుల ఎగుమతికి తక్కువ ఖర్చవుతుంది.
- కర్బన ఉద్గారాలను తగ్గించి పర్యావరణ పరిరక్షణకు మేలు చేసే గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, పంప్డ్ స్టోరేజ్... గ్రీన్ ఎనర్జీదే భవిష్యత్ అంతా. ఈ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో మంచి అవకాశాలున్నాయి. వీటివల్ల చౌకగా విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. రెన్యువబుల్, గ్రీన్ ఎనర్జీకి ఏపీలో పుష్కలమైన వనరులున్నాయి. విండ్, హైడ్రోజన్, సోలార్ విద్యుదుత్పత్తికి ఇక్కడ అపార అవకాశాలున్నాయి. 82 గిగావాట్ రెన్యూవబుల్ ఎనర్జీ కెపాసిటీ, 34 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌లకు అవకాశం ఉంది. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుంది.
- పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలు తీసుకుని, వాటి ప్రకారం ప్రో యాక్టివ్‌గా వ్యవహరిస్తున్నాం. అందుకే ఈ రాష్ట్రంవైపు ఎప్పుడూ చూడని అంబానీ, బిర్లా, అదానీ, బంగూర్, బజాంకా, దాల్మియా.. వంటి వారు ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారు. గతంలో ఇంతమంది దిగ్గజ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చింది లేదు.
- 2021–22లో 11.43 శాతం వృద్ధిరేటుతో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. పలురంగాల్లో అగ్రగామిగా నిలుస్తూ... సులభతర వాణిజ్య విధానాల్లో (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వరుసగా మూడేళ్లు నెంబర్ వన్‌గా నిలిచింది.

ఎస్‌డీజీ లక్ష్యాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు

ఉచిత పథకాలు అంటూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అభివృద్ధి చేయకుండా కేవలం సంక్షేమ పథకాలే ఇస్తున్నామనుకుంటే దేశంలోనే అత్యధికంగా 11.43 శాతం వృద్ధిని ఎలా సాధిస్తాం? అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులేస్తున్నాం. ప్రతి పథకాన్నీ ఎస్‌డీజీ లక్ష్యాలకు అనుగుణంగా డీబీటీ రూపంలో నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నాం. ఉదాహరణకు జీఈఆర్ గణాంకాలు చూస్తే కాలేజీల్లో చేరే వారి సంఖ్య రాష్ట్రంలో ఎక్కువ. 18 నుంచి 23 ఏళ్ల వయస్సులో ఉన్నవారు చదువు మానకుండా కాలేజీలో చేరేలా పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థి డిగ్రీ పూర్తి చేస్తే అతని హోదా మారుతుంది. అందుకే తల్లిదండ్రులకు విద్య భారం కాకుండా ఉండేలా 100 శాతం ఫీజు రీఇంబర్స్‌మెంట్ ఇస్తూ విద్యాదీవెన, వసతిదీవెన, ప్రాథమిక విద్యలో అమ్మఒడి వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఈ మొత్తం నేరుగా కళాశాలలకు ఇవ్వకుండా తల్లుల ఖాతాల్లో వేస్తున్నాం. దీనివల్ల ఆ విద్యార్థి చదువు మధ్యలో ఆగదు. పట్టభద్రుడై ఆదాయాన్ని ఆర్జించడం ద్వారా పేదరికం నుంచి మధ్యతరగతి హోదాలోకి ఆ కుటుంబం మారుతుంది. దేశాభివృద్ధిలో ఇది ఎంతో కీలకమైన అంశం.

బడ్జెట్ పరిమితుల్లోనే... పారదర్శకంగా...



ఈ పథకాలన్నీ కూడా బడ్జెట్ పరిమితుల్లోనే అమలు చేస్తున్నాం. సాధారణంగా రాజకీయ నేతలు సామాన్యులకు అర్థం కాని రీతిలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. గతంలో కూడా ఇదే బడ్జెట్ ఉండేది. ఆ నిధులు ఎక్కడికి వెళ్తాయో ఎవరికీ అర్థమయ్యేది కాదు. లబ్ధిదారులెవరో ఆ దేవుడికే తెలియాలి అనే పరిస్థితి ఉండేది. కానీ రాష్ట్రంలో తొలిసారిగా మేము అందరికీ సరళంగా అర్థమయ్యేలా పారదర్శకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. ప్రతి పథకాన్నీ బడ్జెట్‌లో కచ్చితంగా నిర్దేశించాం. ప్రతి పథకాన్ని లబ్ధిదారుల ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాలతో అనుసంధానించాం. నేరుగా నగదు బదిలీ విధానంలో పథకాన్ని అమలు చేస్తున్నాం.

- ఏ రాష్ట్రానికైనా కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. అందుకే కేంద్రంలోని బీజేపీతో మేము స్నేహపూర్వక వాతావరణమే కోరుకుంటున్నాం. మాకు రాజకీయాల కంటే మా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. ప్రజలకు ఏం కావాలో అది చేయాలనేది మా ప్రభుత్వ విధానం. అందుకే మా ప్రభుత్వం రియాలిటీలో పేదలకు ఏం కావాలో అదే చేస్తోంది. అందుకే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో వేగంగా ముందుకెళ్తున్నాం.

3 రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు

ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా గత ప్రభుత్వ తప్పులను కొన్నింటిని సరిచేస్తుంది, కొన్ని కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తుంది. మేం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, వ్యవసాయం.. ఈ రంగాల్లో పూర్తి స్థాయిలో విప్లవాత్మక చర్యలు చేపట్టాం. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 'నాడు–నేడు' పేరిట ప్రభుత్వాసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నాం. ప్రాథమిక విద్యా రంగంలో 'అమ్మ ఒడి' పథకం ఓ విప్లవం. మేము అధికారంలోకి వచ్చేనాటికి ప్రాథమిక విద్య ప్రమాణాల్లో ఆంధ్ర ప్రదేశ్ దేశంలో చివరి రెండు, మూడు స్థానాల్లో ఉండేది. ఈ పరిస్థితి మార్చాలనుకున్నాం. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు మేం అమలు చేస్తున్న పథకాలు చెబుతా. అమ్మ ఒడి పథకం కింద పిల్లల్ని బడికి పంపే తల్లుల ఖాతాలో రూ.15వేలు వేస్తున్నాం. దీనికి కనీసం 75 శాతం హాజరు ఉండాలనే నిబంధన పెట్టాం. ఇంటర్మీడియట్ వరకు అమ్మ ఒడి పథకం ఇస్తున్నాం. తరవాత జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు అందిస్తున్నాం. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుండటంతో పిల్లల చదువు ఎందుకు ఆపాలని తల్లిదండ్రులు భావిస్తారు కదా?. ఇక ఏటా స్కూళ్లు తెరవటానికి ముందే జగనన్న విద్యా కానుక పేరిట సమగ్ర కిట్‌ను ఇస్తున్నాం. తెలుగు, ఇంగ్లీష్ బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, స్కూల్ బ్యాగ్, షూ, సాక్సులు, యూనిఫామ్ ఇస్తూ యూనిఫామ్‌కు కుట్టేందుకు మజూరీ చార్జీలూ ఇస్తున్నాం. దీనికి ఏటా రూ.వేయి కోట్లకు పైగా నిధులు వెచ్చిస్తున్నాం. ఇక మధ్యాహ్న భోజన పథకాన్ని పూర్తిగా మార్చాం. టీడీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకానికి రూ.600 కోట్ల బడ్జెట్ ఉండేది. దాన్ని రూ.1,908కోట్లకు పెంచాం. జగనన్న గోరు ముద్ద పేరుతో భోజనం నాణ్యత పెంచాం. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టాం. ఆరో తరగతి నుంచి డిజిటల్ తరగతులు ఏర్పాటు చేస్తున్నాం. నాడు–నేడు మొదటి దశ కింద 15,275 పాఠశాలలను ఎంపిక చేసి వాటి రూపు రేఖలను సమూలంగా మార్చాం. రాష్ట్రంలో 30,230 తరగతుల డిజిటలైజేషన్‌ను ఈ జూన్ నాటికి పూర్తి చేస్తున్నాం. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. ఇప్పటివరకు 60వేల మంది ఉపాధ్యాయులకు, 4.70 లక్షల మంది విద్యార్థులకు మొత్తం 5.30 లక్షల ట్యాబ్‌లు పంపిణీ చేశాం.

అంతేకాదు! అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు పెంచాం. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడాదికి రూ.800కోట్లు కేటాయించే వారు. దీన్ని రూ.1,800 కోట్లకు పెంచాం. జగనన్న సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ్ ప్లస్ పేరిట అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార నాణ్యతను మెరుగుపరిచాం. ఎందుకంటే ఆరేళ్ల వరకే పిల్లలు శారీరకంగా, మానసికంగా వేగంగా ఎదుగుతారు. ఆ సమయంలో వారికి సరైన పోషకాహారం అందించాలి. అదే చేస్తున్నాం. ఆడపిల్లల పెళ్లికి సహకరిస్తూ... వారు చదువు కొనసాగించేలా నిబంధనలు పెట్టాం. 10వ తరగతి పాస్ అవ్వాలని, 18 ఏళ్లు నిండాలని నిబంధన పెట్టడం వల్ల వారు పది తరవాత ఇంటర్ చదువుతారు. డిగ్రీలోనూ చేరతారు. చేరారు కనక పూర్తి చేస్తారు. ఈ ఉద్దేశంతోనే వివాహానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నాం.

- చదువుల్లో రాణిస్తూ విదేశాల్లో చదువుకోవాలనుకునే వారికి 'విదేశీ దీవెన' పథకాన్ని అందిస్తున్నాం. నిర్దేశిత 21 ఫ్యాకల్టీల్లో ప్రపంచంలోని టాప్–50 యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించే మన విద్యార్థులకు గరిష్ఠంగా రూ.1.25 కోట్ల వరకూ ఫీజును చెల్లిస్తున్నాం. గత ఏడాది 200మందికి స్పాన్సర్‌షిప్ అందించాం. ఇలాంటి వర్సిటీల్లో చదివిన వాళ్లంతా వచ్చే పదేళ్లలో అత్యున్నత స్థాయికి చేరుకుని, మన రాష్ట్రానికి ఆస్తిగా మారతారన్న విశ్వాసం నాకుంది.
- ప్రభుత్వాసుపత్రులకు కాయకల్ప చికిత్స చేస్తున్నాం. ఎవ్వరూ ఊహించని విధంగా వైద్య రంగంలో ఖాళీగా ఉన్న 48,000 పోస్టులను భర్తీ చేశాం. ప్రతి హాస్పిటల్‌లో డాక్టర్, నర్సులు ఉండేలా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాం. జాతీయస్థాయి ప్రమాణాలు ఉండేలా హాస్పిటల్స్‌ను ఆధునీకరించాం. 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నాం. ఆరోగ్య శ్రీ పరిధిలోకి వచ్చే చికిత్సల సంఖ్యను 1,059 నుంచి ఏకంగా 3,255కు పెంచాం. ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్, హెల్త్‌కార్డుల డిజిటలైజేషన్ ఇలా అనేక సంస్కరణలు తెచ్చాం.
- వ్యవసాయ రంగానికి వస్తే... రైతు భరోసా కేంద్రంపేరిట రైతులకు సంబంధించిన సేవలన్నీ ఒకేచోట అందిస్తున్నాం. ప్రతి గ్రామానికీ వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ పొందిన అధికారిని నియమించడమే కాకుండా ప్రతి రైతు తాలూకు పంట వివరాలను 'ఈ క్రాప్'లో నమోదు చేస్తున్నాం. రైతులకు విత్తనం దగ్గర నుంచి పంట అమ్ముకోవడం వరకూ ఆర్‌బీకే ద్వారా చేయూత అందిస్తున్నాం. పాలన సంస్కరణల్లో భాగంగా.... ప్రతి 2000 జనాభాకు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి 50 మంది జనాభాకూ ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేశాం. ఎటువంటి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. దేశంలో డీబీటీ ద్వారా నేరుగా నగదు అందుకుంటున్న లబ్ధిదారులు రాష్ట్రంలోనే అధికం. మాకు ఓటు వేశారా లేదా, ఏ పార్టీ అనేది చూడకుండా పథకాలు అందిస్తున్నాం.

క్లుప్తంగా...



చీపురు పట్టి.. బాత్‌రూమ్‌లు శుభ్రపరచి..

- లింగంపల్లి బడిలో అపారిశుధ్యం
- స్వయంగా శుభ్రం చేసిన ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

బచ్చన్నపేట: ఆయనొక ప్రజాప్రతినిధి. ఒక ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అక్కడి అపరిశుభ్రత వాతావరణం చూసి హెచ్‌ఎంపై మండిపడ్డారు. అంతే.. స్వయంగా చీపురు పట్టి బాత్రూంలు, మరుగుదొడ్లు శుభ్రపరిచారు. దీనికి వేదికైంది జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల. 'మనఊరు–మనబడి' కార్యక్రమం కింద ఎంపికైన ఈ పాఠశాలను రూ.29 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో తీర్చిదిద్దారు. బుధవారం పాఠశాలను పునః ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి.. చెత్తతో నిండిన మరుగుదొడ్లు, బాత్రూంలను గమనించారు. వెంటనే చీపురు పట్టుకొని చెత్తా చెదారాన్ని బయటకు ఊడ్చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తుంటే.. ఈ పాఠశాలలో హెచ్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ మండిపడ్డారు.

పసుపు క్వింటా రూ.7,648

నిజామాబాద్ మార్కెట్ యార్డులో పలికిన ధర

ఇందూరు (నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పసుపు కొమ్ములకు గరిష్ఠ ధర క్వింటా రూ.7,648 పలికింది. ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే అధిక ధర. వేల్పూర్ మండలం పడగల్‌కు చెందిన రైతు సామ శ్రీనివాస్ 20 బస్తాల పసుపును మార్కెట్‌కు తీసుకురాగా ఈ ధర పలికింది. మార్కెట్‌లో కొమ్ము పసుపు 5,695 క్వింటాళ్లు, మండ పసుపు 2,498 క్వింటాళ్లు, చూర పసుపు 825 క్వింటాళ్లు అమ్ముడయ్యాయి.

ఎత్తంలో 'సర్కార్ నౌకరి' సినిమా షూటింగ్



కోడేరు: మండలంలోని ఎత్తంలో కోదండ రామస్వామి ఆలయం ఎదుట ఉన్న రచ్చబండ వద్ద బుధవారం సర్కార్ నౌకరి సినిమా షూటింగ్ కొనసాగింది. రచ్చబండ వద్ద పంచాయతీ సర్పంచ్‌గా సినీ నటుడు తనికెళ్ల భరణితో పాటు మరో మహిళ, బాలుడు నటించారు. పిల్లలు పుట్టకపోతే జమ్మిచెట్టుకు ముడుపులు కట్టే సన్నివేశాన్ని చిత్రీకరించారు. డైరెక్టర్‌గా రాఘవేందర్‌రావు, మరి కొందరు షూటింగ్‌లో పాల్గొన్నారు. మండలంలో మొదటి సారి షూటింగ్ చేస్తుండడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

బాదేపల్లి ఆస్పత్రిని సందర్శించిన కమిషనర్



జడ్చర్ల టౌన్: బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రి (కమ్యూనిటి హెల్త్‌సెంటర్)ని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సౌకర్యాల గురించి సూపరింటెండెంట్ సోమశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అంతా కలియ తిరిగి సదుపాయాలపై ఆరా తీశారు. రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలపై ఆరాతీశారు. గంగాపూర్ రోడ్‌లో నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి పనులు ఎందాక వచ్చాయంటూ సూపరింటెండెంట్‌ను అడిగారు. రోగులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన మరిన్ని మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

1,021 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 975, సమాంతర కాల్వ ద్వారా 110 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 200, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

వెంకన్నకు పుష్కర బ్రహ్మోత్సవం



వట్టెం వెంకన్న ఆలయం



స్వామి వారి పుష్కరిణి



మూల విరాట్

- ప్రకృతీ పుణ్యక్షేత్రంగా వేంకటేశ్వస్వామి ఆలయం
- నేడు వట్టెంకు చినజీయర్‌స్వామి
- బ్రహ్మోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

బిజినేపల్లి: ఆనందం, ఆహ్లాదం, అద్భుతం ఈ మూడు పదాలకు అర్థం తెలియాలంటే వట్టెం వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని సందర్శించాలి. అప్పుడు వారికి అనుభూతులు ఒకే సారి కలుగుతాయి. ఇప్పుడు అదే వాతావరణంలో స్వామి వారి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు త్రిదండి చినజీయర్ స్వామి హాజరుకానున్నారు.

బిజినేపల్లి మండలంలోని వట్టెం గ్రామ అడ్డగట్టుపై ఆశ్రమం ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న గుడ్లనర్వకు చెందిన చింతకుంట నరసింహరావుకు 1978– 1981 కాలంలో వేంకటేశ్వరస్వామి వారి గుడిని నిర్మించాలనే ఆలోచన పుట్టింది. ఆ ఆలోచనను 1983లో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్న సందడి రంగారెడ్డికి తెలిపారు. ఆ తర్వాత గ్రామస్తుల సహకారంతో 1983లో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1986 మే 19న వేంకటేశ్వరస్వామి వారి మూల విరాట్‌ను త్రిదండి చినజీయర్‌స్వామి ప్రతిష్ఠించారు. దినదిన ప్రవర్తమానమై భక్తుల కో ర్కెలు తీర్చే చిన్న తిరుపతిగా వెలుగొందుతూ ప్ర శాంత వాతావరణం కలిగిన దేవాలయంలో ప్రసిద్ధి గాంచుతూ వచ్చింది. ఆలయంలో కల్యాణ మండపం, నిత్యాన్నసత్రం, గోశాల, కోనేరు, యాగశాల, ప్రకృతి వనం, అతిథి గృహం నిర్మించారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధికి ఆయా స్థానిక కంపెనీలు, దాతలు తమ తోడ్పాటును ఇస్తున్నాయి.

తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా మార్చి 10వ తేదీ వరకు స్వామి వారికి పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- 2న సాయంత్రం త్రిదండి చినజీయర్‌స్వామి వారు బ్రహ్మోత్సవాల ప్రధాన కార్యక్రమాలు సుదర్శన ఇష్టి, హోమం, పూర్ణాహుతి, బలి ప్రదానం నిర్వహించనున్నారు.
- 3న నిత్య పూజలతో పాటు లక్ష్మీ నారాయణ పూజలు, పుష్కర సంచిక ఆవిష్కరణ.
- 4న శ్రీవారికి ఏకోత్తర సహస్ర కలశాభిషేకం, సమాశ్రయణములు, అర్చన, నివేదన.
- 5న వాసుదేవ పుణ్యాహవచనం, బ్రహ్మోత్సవం అంకురార్పణ, ధ్వజాదివాసం.
- 6న సంతానం కోసం పుత్రకామేష్టి, భేరీ తాండనం.
- 7న వివాహం కోసం లక్ష్మీ నారాయణ ఇష్టి, శేష వాహన సేవ
- 8న శ్రీవారి కల్యాణం, గరుడోత్సవం.
- 9న సకల విద్యాప్రాప్తికి హాయగ్రీవ ఇష్టి, హోమం, సాయరాధన,
- 10వ తేదీన చక్రతీర్థ స్నానం, రాజభోగం, పుష్పాయాగం ఉత్సవ పరిసమాప్తి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

మూర్తిమంత్ర హోమాలు

వట్టెం వేంకటేశ్వరస్వామి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారికి మూర్తిమంత్ర హోమం ఆలయ అర్చక బృందం నిర్వహించింది. బుధవారం ఉదయం ప్రాతరాధన సేవ, అర్చన, సేవ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి, అరణి మథనం నిర్వహించారు. అగ్ని ప్రతిష్ఠ చతుస్థానార్చన కార్యక్రమం పుష్కరిణిలో చేసి వేద పారాయణం చేశారు. సాయంత్రం అర్చన, సామారాధన, బలి ప్రదానం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేశారు.



స్వామి వార్ల ఉత్సవ మూర్తులు



దేవాలయం వద్ద పురావస్తు శాఖ అధికారులు

1,800ఏళ్ల నాటి ఆలయం పరిశీలన

దేవరకద్ర రూరల్: మండలంలోని బస్వాయపల్లిలో 1,800ఏళ్లనాటి పురాతన వేణుగోపాలస్వామి దేవాలయాన్ని బుధవారం పురావస్తుశాఖ సహాయ సంచాలకులు డి.బుజ్జి, మ్యూజియం ఇన్‌చార్జ్ నగేష్ సందర్శించారు. వందల ఏళ్లు గడిచిన చెక్కుచెదరకుండా ఉండడంపై వారు పరిశీలించారు. దేవాలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చి తగిన మెరుగులు దిద్దాల్సిన అవసరంపై అంచనా వేశారు. దేవాలయం లోపల, బయట కట్టడాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ దేవాలయాన్ని తీర్చిదిద్ది వెలుగులోకి తీసుకురావాలని గతంలో అధికారులకు విన్నవించామని గ్రామస్తులు తెలిపారు. పాత కట్టడాలను పరిరక్షించి వాటి గురించి అందరికి తెలిసేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేందర్, ఆంజనేయులు, కోఆప్షన్ సభ్యుడు ఖదీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి కట్టడిలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: రాష్ట్రంలో యువత డ్రగ్స్, గంజాయి, మద్యానికి బానిసలుగా మారి ఆరోగ్యం పాడుచేసుకోవడంతో పాటు పెడదోవపడుతున్నారని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగం మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మద్యం పాలసీతో యువత మద్యం సేవించి పెడదోవపట్టడంతో పాటు హత్యలకు సైతం వెనకాడడం లేదని అన్నారు. ర్యాగింగ్‌ను కట్టడి చేయకపోవడంతో వరంగల్‌లో డాక్టర్ ప్రీతి సూసైడ్ చేసుకుందని, ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో తప్పులు జరుగుతున్నా మంత్రి హరీశ్‌రావు పట్టించుకోవడం లేదని తెలిపారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల గురించి ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసినా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అర్థం రవి, పాండు, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనులకు భరోసా



అలంపూర్‌లో వ్యవసాయ పొలంలో కూలీలతో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- అలంపూర్, ఉండవెల్లి మండలాల్లో సాగిన యాత్ర

అలంపూర్: బీఎస్పీతోనే బహుజనుల బతుకు మారడానికి భరోసా వస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం అలంపూర్, ఉండవెల్లి మండలాల్లో బహుజన రాజ్యాధికార యాత్ర కొనసాగింది. నాల్గవ రోజు యాత్రలో భాగంగా అలంపూర్ మున్సిపాలిటీలో కలియ తిరిగారు. ఉదయం వాకింగ్ వెళ్లిన ఆయన రోడ్డు పక్కన పొగాకు పొలంలో పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. సాగు ఖర్చు, గిట్టుబాటు ధరలను అడిగి తెలుసుకున్నారు. రోజు వారి వ్యవసాయ కూలీలతో మాట్లాడారు. అనంతరం యాత్రలో భాగంగా మున్సిపాలిటీలోని వీధుల్లో తిరిగారు. స్థానికులను పలకరిస్తూ వారి యోగక్షేమాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ చదవుకుంటున్న రోజుల్లో తిరిగిన వీధుల్లో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సంతబజార్‌లో నివాసం ఉంటున్న వారి ఇళ్లకు వెళ్లి కూర్చొని మాట్లాడారు. స్థానికులు ఇళ్లు, పింఛన్లు, విద్య, వైద్యం, అంతర్గత, ప్రధాన రోడ్లు ఇతర సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. పారిశుద్ధ్య కార్మికులు, దుకాణాదారులు, స్నేహితులను పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో బీఎస్పీని అధికారంలోకి తీసుకొస్తే పేద ప్రజలకు అండగా ఉంటామన్నారు. నియోజవర్గ అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నుంచి రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలన్నారు. లేదంటే బీఆర్‌ఎస్ నాయకులను బయట తిరనివ్వమని హెచ్చరించారు. బహుజన రాజ్యాధికార యాత్ర రాష్ట్రంలో 191వ రోజు కొనసాగుతుందన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకోవడానికి యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. పుట్టిన గడ్డపై తిరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రైతులను, ప్రజలను కసుకోవడంతో వారి బాధలు నాకు తెలుసొచ్చాయన్నారు. 9ఏళ్లలో గజ్వేల్ నియోజకవర్గానికి రూ.656 కోట్లు ఎస్‌డీఎఫ్ నుంచి సీఎం కేసీఆర్ వాడుకున్నారన్నారు. సిద్ధిపేటకు రూ.714 కోట్లు ఇచ్చారన్నారు. కానీ అలంపూర్‌కు తొమ్మిదేళ్లలో కేవలం రూ.20 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. ఈ సారి బడ్జెట్‌కులో ఆర్డీఎస్‌కు, తుమ్మిళ్ల ఎత్తిపోత పథకాలకు ఒక్కపైసా ఇచ్చినట్లు రికార్డుల్లో లేవన్నారు. ఈ బడ్జెట్‌లో రూ.10వేలకోట్లు ఎస్‌డీఎఫ్‌లో పెట్టుకున్నారన్నారు. రూ.వెయ్యి కోట్లు ప్రచారానికి పెట్టుకున్నారని ఆరోపించారు. మారుమల ప్రాంతం కావడంతో ఏ పాలకులు పట్టించుకోలేదన్నారు. వచ్చిన ప్రతి సారి వంద కోట్లు అంటున్నారు కానీ వంద రూపాయలు రావడం లేదన్నారు. రైతులకు ఆర్డీఎస్ ఆధునీకరణ, తుమ్మిళ్లకు రిజర్వాయర్లు నిర్మాణం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేశవరావు, రాములమ్మ, మహేష్, కనకం బాబు, సుంకన్న, నాగరాజు, సురేష్ తదితరులు ఉన్నారు.